రెండు రోజుల్లో రూ.6.5 కోట్ల మద్యం తాగేశారు



మద్యం బాబులు రెండు రోజుల్లో రూ.6.5 కోట్ల విలువచేసే మద్యం తాగేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరుపుకొన్నారు. దీనికోసం డిసెంబర్ 31, జనవరి ఒకటో తేది చాలా ప్రాంతాల్లో ఈవెంట్లు నిర్వహించారు. ఇందులో మద్యంబాబులు బాగా ఎంజాయ్ చేశారు. ఇవికాక మద్యం దుకాణాలు రెండు రోజులు కిటకిటలాడాయి. జిల్లాలో 82 మద్యం దుకాణాలు, 10 బార్లు, ఐదు టూరిజం మద్యం దుకాణాలు, ఒక ఎలైట్ మద్యంమాల్ ఉన్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి 12 గంటలవరకు మద్యం దుకాణాల్లో విక్రయాలకు అనుమతిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలు, బార్లలో డిసెంబరు 31వతేది సుమారు రూ.3 కోట్లు, జనవరి 1తేది రూ.3.5 కోట్ల విలువచేసే మద్యం విక్రయాలు జరిగాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది.

- చిత్తూరు సిటీ

ఆలయాలు కిటకిట

నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం కాణిపాకం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు రద్దీ తగ్గకుండా వరసిద్ధుడి దర్శనార్థం విచ్చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి మాడ వీధుల్లోకి వచ్చేశారు. దీంతో స్వామి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. భక్తులకు అన్నం ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను అందించారు.

- ఐరాల(కాణిపాకం)



వరసిద్ధుడి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

● హ్యాపీ న్యూఇయర్ పాలిటిక్స్

చిత్తూరులో డీకే కుటుంబం సందడి

డీఏ శ్రీనివాస్‌ను కలిసిన టీడీపీ, వైసీపీ నేతలు

చిత్తూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరులో న్యూఇయర్ వేడుకల పేరుతో రాజకీయ సందడి జోరందుకుంది. చిత్తూరు నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలు నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలు జరుపుకొన్నారు. మాజీ ఎంపీ, దివంగత డీకే ఆదికేశవులు నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాస్ ఇంటికి టీడీపీ, వైసీపీ నాయకులు సోమవారం క్యూకట్టారు. వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని ఆయన ఇప్పటికే ప్రకటించారు. ఆదికేశవులు నాయుడి తమ్ముడు బద్రినారాయణ పలువురు ప్రముఖులను ఇంటికి ఆహ్వానించారు. వేడుకలకు వచ్చిన వారిలో సింహభాగం టీడీపీ నాయకులే. ఓ దశలో ఆయనకు టీడీపీ నాయకులు పసుపు కండువాను వేయడం చూస్తుంటే డీఏ శ్రీనివాస్ టీడీపీలో యాక్టివ్ అయ్యేటట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. శ్రీనివాస్‌ను కలిసిన టీడీపీ నాయకుల్లో దొరబాబు, చంద్రప్రకాష్, హేమలత, కాజూరు బాలాజీ, గురజాల జగన్‌మోహన్, వసంత్, ఎన్‌పీఎస్ ప్రకాష్ తదితరులున్నారు.





డీఏ శ్రీనివాస్, బద్రినారాయణకు పసుపు కండువాలు వేసిన టీడీపీ నేత బాలాజి - శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న గురజాల జగన్‌మోహన్



డీఏను కలిసిన విజయానందరెడ్డి

చిత్తూరు అసెంబ్లీకి వైసీపీ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి.. డీఏ శ్రీనివాస్‌ను కలవడం కూడా చర్చగా మారింది. విశేషం ఏమిటంటే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కూడా ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్ ఏకే రవి, కోఆప్షన్ మెంబర్ కోలా కిరణ్‌కుమార్ కూడా సోమవారం శ్రీనివాస్‌ను కలిసినవారిలో ఉన్నారు.



చిత్తూరులోని టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న గీర్వాణి, చంద్రప్రకాష్, దొరబాబు తదితరులు

చంద్రప్రకాష్, గురజాల హడావుడి

ఇలా ఉండగా టీడీపీ నుంచి టికెట్ ఆశిస్తున్న చంద్రప్రకాష్ కూడా ఆదివారం రాత్రి జిల్లా టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల పేరుతో సందడి చేశారు. చిత్తూరుతో పాటు జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున శ్రేణులు తరలివచ్చారు. అలాగే సోమవారం కూడా చిత్తూరు రూరల్ మండల నేతల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఇక, గురజాల జగన్‌మోహన్ తన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు కూడా శ్రేణులు రాగా, వారికి స్వీట్లను పంపిణీ చేశారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు మహిళా నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కుప్పం, జనవరి 1: కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు జరిపారు. ఈ దాడుల్లో 12 కిలోల గంజాయి ప్యాకింగ్ చేసిన కవర్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కలిగి ఉన్న విశాఖపట్టణం రోలుగుంట మండలం బెన్నభూపాలపతనం గ్రామానికి చెందిన లోవలక్ష్మి (27), తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా పెంచంపల్లి తాలూకా బేరుపల్లి గ్రామానికి చెందిన మల్లికా కేశవన్ (55)ను అరెస్టు చేశారు. ఈ గంజాయి కాకినాడ నుంచి కృష్ణగిరి అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించారు.



టీడీపీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న అమరనాథరెడ్డి

హామీల అమల్లో 85 శాతం ఫెయిల్

● జగన్ చెప్పింది 730.. నెరవేర్చింది 109 మాత్రమే

● మాజీ మంత్రి అమర్ విమర్శ

పలమనేరు, జనవరి 1: 'ఎన్నికల సందర్భంగా జగన్ 730 హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేవలం 109 మాత్రమే నెరవేర్చారు. అంటే.. 15 శాతం అమలు చేసి 85 శాతం ఫెయిల్ అయ్యారు. కానీ 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ అబద్దాలు చెబుతున్నారు' అంటూ మాజీ మంత్రి అమరనాథ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారన్నారు. రాజధానిని విధ్వంసం చేశారని విమర్శించారు. పోలవరాన్ని రివర్స్ చేయడం ద్వారా నదుల అనుసంధానానికి గండికొట్టి రాష్ట్రాన్ని కరువురక్కసికి బలిపెట్టారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 1.14 లక్షల కోట్లు దారిమళ్లించి సామాజిక న్యాయం గొంతు కోశారని ధ్వజమెత్తారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పారన్నారు. అంగన్వాడీలకు తెలంగాణకన్నా అదనంగా రూ.1000 పెంచతానన్న హామీపై జగన్ మడమతిప్పారన్నారు. మద్యనిషేధం చేసి ఓటు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా.. మద్యంపై ఆదాయాన్ని 15 ఏళ్లపాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. విద్యుత్ చార్జీలు పెంచనన్న హామీకి గండికొట్టి రూ.64 వేల కోట్ల భారాన్ని రాష్ట్రప్రజలపై మోపారన్నారు. సీపీఎస్ రద్దు, రైతు రుణ మాఫీ, మద్యనిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు అడ్డుకట్ట వంటి అనేక హామీలపై జగన్ మాట తప్పారన్నారు. అయినా, తాను 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ అబద్దాలు చెప్పడం ఆయనకే చెల్లునన్నారు. 'చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలను సొంత కాళ్లపై నిలబెట్టేలా చేశాయి. జగన్ సంక్షేమ పథకాలు పేదలను నిరుపేదలుగా చేసి ఓటు యంత్రాలుగా మార్చి ఆయనపై ఆధారపడే బిచ్చగాళ్లుగా చేశాయి. టీడీపీ ప్రభుత్వం రూ.3లక్షల రాయితీతో ఒక ఎస్సీ డ్రయివర్‌కు ఇన్నోవా కారు ఇచ్చి.. సొంతకాళ్లపై నిలబెట్టింది. జగన్ ఏమో అమ్మఒడికి రూ.13 వేలు ఇచ్చి నాన్న బుడ్డీలో రూ.50 వేలు కొటేస్తున్నారు' అంటూ అమరనాథ రెడ్డి విమర్శించారు.



పడకలు, మందులు సరే.. నిర్ధారించే కిట్లెక్కడ?

● రాష్ట్రంలో నమోదవుతున్న కరోనా కేసులు

● జిల్లాకు అందని కొవిడ్ కిట్లు ● పట్టించుకోని అధికారులు

కరోనాపై కేంద్రం హెచ్చరికలతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని 73 ప్రభుత్వాస్పత్రులు, మూడు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కొవిడ్ వార్డులు, పడకలు, మందులు, మాత్రలు సిద్ధం చేసింది. కానీ, కొవిడ్‌ను నిర్ధారించే కిట్లు మాత్రం లేవు. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు నమోదువుతున్నా కిట్లను సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. కొవిడ్ నిర్ధారణ కాకుంటే బెడ్లు, మందులు ఎందుకని విమర్శలు వినిపిస్తున్నాయి.

- చిత్తూరు రూరల్

కొవిడ్ తగ్గిపోయి మూడేళ్లయింది. ఇప్పుడు కొత్త వేరియంట్ జేఎన్-1 ప్రవేశించడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ సంఖ్య కేరళలో ఎక్కువగా ఉంది. జిల్లా నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు కేరళలోని శబరిమలై వెళ్తున్నారు. తిరిగి వచ్చిన కొందరు జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటితో బాధ పడుతున్నారు. వారికి కొవిడ్ పరీక్షలు నిర్వహించాలన్నా జిల్లాలో కొవిడ్ కిట్లు అందుబాటులో లేవు. ప్రైవేటులో డబ్బులిచ్చి చేయించుకోవాలన్నా అందుకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దీంతో అధిక సంఖ్యలో కొవిడ్ లక్షణాలు ఉన్న వారు తిరుపతి రుయాస్పత్రి, స్విమ్స్ బాట పడుతున్నారు. మరికొందరు అక్కడి వరకు వెళ్లలేక కొవిడ్ అని నిర్ధారించుకొని ఇంట్లోనే హోం ఐసోలేషన్‌లో ఉంటూ మెడికల్ షాపుల్లో మందులు కొని వాడేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని కొవిడ్ లక్షణాలున్న వారి ఇళ్ల పక్కనున్న వారు భయాందోళన చెందుతున్నారు.

పరీక్షలకు తిరుపతికి వెళ్లాల్సిందే

జిల్లా పునర్విభజన తర్వాత పెద్దాస్పత్రులన్నీ తిరుపతిలోనే ఉండటంతో చిత్తూరు జిల్లాకు చెప్పుకోదగ్గ ఆస్పత్రులు లేకుండా పోయాయి. ఉన్న ఒక్క జిల్లా ఆస్పత్రి కూడా అంతంతమాత్రంగానే వైద్య సేవలు అందిస్తోంది. చిన్న రోగాలకే తిరుపతి ఆస్పత్రులకు రెఫర్ చేసే ఇక్కడి వైద్యులు.. కొవిడ్ లాంటి మహమ్మారికి వైద్యం చేస్తారా? అని చిత్తూరు ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ పరీక్షలు చేసేందుకు ఆర్టీపీసీఆర్ ల్యాబ్ అందుబాటులో లేకపోవడంతో పక్క జిల్లాపై ఆధారపడాల్సి వస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

శబరిమలకు ఇటీవల ఎక్కువ సంఖ్యలో భక్తులు వెళ్లొచ్చారు. ఇక, మకరజ్యోతికి వెళ్లే వారికి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇక, ఉపాధి నిమిత్తం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఉద్యోగ రీత్యా ఉన్నవారు సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వచ్చే అవకాశముంది. ఈ తరుణంలో కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇవి పాటించాలి..

- మాస్కులు ధరించాలి.
- చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- చలిప్రదేశంలో తిరగకూడదు.
- జ్వరం, దగ్గు, తుమ్ములు, ముక్కు నుంచి కారడం వంటి లక్షణాలున్న వారికి దూరంగా ఉండాలి.
- దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి.
- దగ్గు, జలుబు, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యులను సంప్రదించాలి.

ఇండెంట్ పెట్టాం



కరోనా నిర్ధారణ కిట్లు కావాలని ఇండెంట్ పెట్టాం. వచ్చిన వెంటనే అనుమానితులకు పరీక్షలు చేస్తాం. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేరళ, ఇతర దూర ప్రాంతాలు నుంచి వచ్చిన వారు, కొవిడ్ లక్షణాలు ఉన్న వారు హోం ఐసోలేషన్‌లో ఉండాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి. భౌతికదూరం పాటించాలి, మాస్కులు, శానిటైజర్లు వాడాలి. కొవిడ్ లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- ప్రభావతిదేవి, చిత్తూరు డీఎంహెచ్‌వో

అంగన్వాడీల నిరసన హోరు

చిత్తూరు, జనవరి 1: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 21వ రోజైన సోమవారం కూడా కొనసాగింది. నూతన ఆంగ్ల సంవత్సరాది రోజునా వీరు శిబిరాల్లో కూర్చుని నిరసన తెలిపారు. సీఎం పట్టించుకోలేదు.. మీరైనా మా సమస్యలు పట్టించుకోండంటూ కార్వేటినగరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. జనవరి ఫస్టు రోజునా ప్రభుత్వం తమకు మనశ్శాంతి లేకుండా చేస్తోందని చిత్తూరులో జరిగిన నిరసనలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. శాంతిపురంలో అంగన్వాడీలు జానపద పాటలు పాడుతూ.. కోలాటాలు ఆడుతూ వినూత్న తరహాలో నిరసన తెలిపారు. జనవరి ఫస్టున కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయాలకు వెళ్లాల్సిన తమను ప్రభుత్వం ఇలా రోడ్డుపై పడేసిందని వాపోయారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ఇలా హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక మరచిపోవడం ఏమిటని పుంగనూరులోని నిరసనలో అంగన్వాడీలు జగన్‌ను ప్రశ్నించారు. పలమనేరులో అంగన్వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలతో తమ నిరసన కొనసాగించారు.



కార్వేటినగరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద అంగన్వాడీల నిరసన


మీరుపెట్టిన కోట్లు ఎవరికోసం?



కుప్పంలో చీరలు, ఫోన్లకు పూజ చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కుప్పం: ప్రభుత్వం జీతభత్యాలు ఇవ్వడం మానేసి అనవసరమైన వాటికి పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చు ఎవరికోసమో చెప్పాలని అంగన్వాడీలు డిమాండు చేశారు. కుప్పంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఎదుట సమ్మెలో ఉన్న అంగన్వాడీలు సోమవారం కూడా నిరసన కొనసాగించారు. సీఐటీయూ నాయకురాలు లలిత మాట్లాడుతూ.. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డిని తాము కలిసినప్పుడు అన్న మాటలను గుర్తు చేశారు. అంగన్వాడీల ఫోన్లకోసం రూ.85 కోట్లు, చీరలకు రూ.16 కోట్లు ఖర్చు చేశామని ఆయన చెప్పిన మాటలను ఎద్దేవా చేశారు. ఆ చీరలు, ఫోన్లు దేనికి పనికి వస్తాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. సరైన వేతనం లేకుండా, కుటుంబాలు పస్తులుంటున్నాయని, ఫోన్లు, చీరలను తిని బతకలేం కదా అని నిలదీశారు. యూనిఫామ్‌గా ఇచ్చి చీరలకు, ఫోన్లకు దీక్షా శిబిరంలో పూజ చేసి అంగన్వాడీలు తమ నిరసన తెలిపారు. 'మీ స్కూల్ గోయిందా, ఫోన్లు గోయిందా, యాప్‌లు గోయిందా, సంపూర్ణ పోషణ గోయిందా...' అంటూ వ్యంగ్యంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.


పీఎస్ఎల్వీ-సీ 58 తొలి దశ


రెండో దశ


మూడో దశ


నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

గఘన విజయం

కొత్త ఏడాది తొలి ప్రయోగ విజయంతో షార్‌లో సంబరోత్సాహాలు



సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్ఎల్వీ 60వ ప్రయోగం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో కొత్త ఉత్సాహం నింపింది. సంవత్సరం ప్రారంభపు రోజున ఇస్రోకి లభించిన విజయంగా భావిస్తున్నారు. ఇస్రో విజయాశ్వంగా భావించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ సోమవారం ఉదయం ఎక్స్‌పో శాట్ ఉపగ్రహంతో పాటూ కీలక పరిశోధనలకు ఉపయోగపడే పది పరికరాలను అంతరిక్షంలోకి చేర్చింది. ఇస్రో భవిష్యత్ ప్రయాణానికి ఈ ప్రయోగాలు చాలా ప్రాధాన్యం కలిగినవి.

సంబరాలు

ఆదివారం ఉదయం 8.10 గంటలకు మొదలైన రాకెట్ కౌంట్‌డౌన్ 25 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం 9.10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి పీఎస్ఎల్వీ దూసుకెళ్లింది. ఏ రకమైన తడబాటు లేకుండా నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, పరికరాలనూ ప్రవేశపెట్టడంతో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగులు పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. హ్యాపీ న్యూ ఇయర్‌తో పాటూ కంగ్రాట్స్ అనే మాట అందరినోటా వినిపించింది.విజిటర్స్ గ్యాలరీలో ప్రయోగాన్ని చూసేందుకు వచ్చినవారి చప్పట్లతో, ఈలలతో ఆ ప్రాంతం మార్మోగింది. అంతరిక్షంలోకి పంపిన పది పరిశోధక పరికరాల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా శ్రీహరికోట నుంచి ప్రయోగాన్ని వీక్షించారు.



భక్తులతో పోటెత్తిన బోయకొండ



చౌడేపల్లె, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గంగమ్మ భక్తులతో పోటెత్తింది. సోమవారం ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆంగ్ల నూతన సంవత్సరం కావటంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు యువకుడి బలి


మృతిచెందిన త్యాగయ్య

బంగారుపాళ్యం, జనవరి 1: అటవీ జంతువుల వేటకోసం ఏర్పాటు చేసిన కరెంటుతీగల ఉచ్చులోపడి ఓ యువకుడు మృతిచెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి బంగారుపాళ్యం మండలంలోని పెరుమాళ్ళపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అడవిజంతువులను వేటాడేందుకు వేటగాళ్లు పొలాల వద్ద కరెంటు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేశారు. పెరుమాళ్ళపల్లికి చెందిన సురేష్ పొలం మీదుగా అదే గ్రామానికి చెందిన బాలరాజు కుమారుడు త్యాగయ్య(35) తమ మామిడి తోట వద్దకు ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో సురేష్ పొలం వద్ద వేటగాళ్లు అమర్చిన కరెంటు తీగల ఉచ్చును ఆయన గుర్తించలేదు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై పొలంలోనే మృతిచెందారు. ఇతడు చిత్తూరులోని ఓ బంగారు దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. భార్య శోభ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

11మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

ఏటిగడ్డపాళ్యం గొడవ వివాదం

పుంగనూరు, జనవరి 1: పుంగనూరు ఏటిగడ్డపాళ్యంలో శనివారం రాత్రి కర్రలు, రాడ్లతో ఇళ్లలోకి చొరబడి దాడి చేసిన 11మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుకుమార్ తెలిపారు. 'పుంగనూరుకు చెందిన కొందరు గతనెల 30వ తేది రాత్రి తమ ఇళ్లలోకి దూరారు. మీరు బర్త్‌డే చేసుకోవాలంటే టిప్పుసుల్తాన్ జెండాలు తీస్తారా? ఎంత ధైర్యం, మీ అంతు చూస్తాం' అంటూ కొట్టి గాయపరిచారని ఏటిగడ్డపాళ్యంకు చెందిన రెడ్డెప్ప భార్య ఎం.శాంతమ్మ ఫిర్యాదు చేశారన్నారు. పుంగనూరుకు చెందిన నవాజ్, ఖాజా, ఇంతు, నూర్, సుహైల్, అమీన్, చోటు, పీరు, అస్లాం, సుబీర్, ముబారక్‌తోపాటు మరికొందరు కొట్టడమే కాకుండా ధనకొండ గంగమ్మ గుడిపై రాళ్లు, కర్రలు విసిరి భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. దీంతో వారిపై దాడి, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలినరీ ఇన్‌స్టిట్యూట్ దక్షిణ భారతావనికి వరం

అడ్మిషన్లు మరింతగా పెంచాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 1: తిరుపతిలోని పాకశాస్త్ర సంస్థ దక్షిణ భారతావనికి వరం లాంటిదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభివర్ణించారు. సోమవారం ఆయన కలినరీ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించారు. ఫ్యాకల్టీతో మాట్లాడారు. అడ్మిషన్లు తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. అన్ని కోర్సులకు అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఇక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయని, రెండేళ్లుగా అంతకంటే ఎక్కువ ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఫ్యాకల్టీ మంత్రికి వివరించారు. సిబ్బంది కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అకడమిక్ విషయాలు, వసతులు, ఫ్యాకల్టీ సామర్థ్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. సంస్థకు మరిన్ని నిధులు అందిస్తామన్నారు. కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్, పర్యాటక శాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ వెంకటేషన్ దత్తాత్రేయన్, అలిపిరి సమీపంలోని ఎస్ఐహెచ్ఎం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి - ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రెవెన్యూ, ఇతర ఉద్యోగసంఘాల నాయకులు - జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీవోలు, పీఆర్, ఇతర శాఖల అధికారులు

కలెక్టరేట్‌లో న్యూఇయర్ వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 1: అధికారులు ఇనుమడించిన ఉత్సాహంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడపడంలో భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జిల్లాకేంద్రంలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. కలెక్టర్ షన్మోహన్ విజయవాడలో సీఎం పేషీకి వెళ్లారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న జేసీ పి.శ్రీనివాసులు సోమవారం మధ్యాహ్నం డీఆర్వో రాజశేఖర్, జేసీ క్యాంపు ఆఫీసు సిబ్బంది, జిల్లా అధికారులతో కలిసి కేక్ కట్‌చేశారు. ఈయనకు పలువురు అధికారులు దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేసీ క్యాంపు కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి జేసీ దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డిని పలువురు ఎంపీడీవోలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిత్తూరు: ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ అధికారులు, జిల్లా పోలీసుకార్యాలయంలో పనిచేసే సిబ్బంది, పలువురు సీఐలు, ఎస్ఐలు సబ్ డివిజన్ల వారీగా అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు : మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల, జనవరి1: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం మండలంలోని బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో 334 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు మంత్రి మాట్లాడుతూ రాబోరు కాలంలో ఇంటింటికి తాగునీటి కొళాయి ద్వారా నీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే సచివాలయాలు జన్మభూమి కార్యాలయాలుగా మార్చేస్తారన్నారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జేసీ శ్రీనివాసులు, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచు ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో నూతన సంవత్సర వేడుకలు



పలమనేరు, జనవరి1 : పలమనేరు మార్కెట్ యార్డు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సిబ్బంది, మార్కెట్ కమిటీ డైరెక్టర్ల సమక్షంలో ఏఎంసీ ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి కేక్ కట్ చేశారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ పాల్గొన్నారు.

సోమల : సోమల అభయాంజనేయస్వామి ఆలయం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆవులపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయం, దుర్గం కొండ గార్గేయ మహర్షి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లారి కిశోర్‌ను కలిసిన పుంగనూరు నాయకులు



పుంగనూరు, జనవరి 1: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని పుంగనూరు టీడీపీ నాయకులు స్వగ్రామం నగిరిపల్లెలో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు దుశ్శాలువాలతో సత్కరించి, స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం న్యూఇయర్ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి సోమల సురేశ్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఆసూరి బాలాజీ, మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీరెడ్డి, మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, మోహన్‌నాయుడు, వరదరాజులు, నిర్మల్‌నాయక్, శశికుమార్, నాగరాజ, రాఘవ, జనసేన నాయకులు పగడాల రమణ, నరేశ్‌రాయల్, చైతన్య రాయల్, విరూపాక్షి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం టీడీపీకి అన్నీ శుభాలే



మునిరత్నంకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

రామకుప్పం, జనవరి 1: కొత్త సంవత్సరంలో టీడీపీకి అన్నీ శుభాలే జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్ తెలిపారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు పార్టీ పెద్దలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా టీడీపీ వైపు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వారి ఆదరణతో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు రామమూర్తి, కృష్ణానాయక్, నందారెడ్డి, రామకృష్ణప్ప, జయశంకర్, మహ్మద్‌రఫీ, కొత్తపల్లెబాబు, వెంకటాచలం, మనోహర్, విజయ్‌కుమార్‌రెడ్డి, కేశవరెడ్డి, రామలింగారెడ్డి, నియాజ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పుంగనూరులో అన్నదాన కార్యక్రమాలు



పుంగనూరు రూరల్, జనవరి1: పుంగనూరులో సోమవారం రెండు ప్రాంతాల్లో పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరాసర్కిల్‌లో అమ్మ అన్నదాన కార్యక్రమం లో భాగంగా పులినాడు బృందం 8వారాలుగా ప్రతి సోమవారం అన్నదానం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం వారపు సంత కావడంతో బయట ప్రాంతాల నుంచి ప్రజలు పట్టణానికి వస్తారని, వారి ఆకలి తీర్చడానికి అన్నదానం చేస్తున్నట్లు పులినాడు సభ్యులు తెలిపారు. అలాగే తూర్పుమొగసాల సర్కిల్‌లో నిరుపేదలు, నిరాశ్రయులు, చిరువ్యాపారస్తులకు వీరశైవ జంగమ లింగాయత్ సేవా సంఘం వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు టానాదార్ నాగరాజు, ప్రతినిధులు అరసు నాగరాజు, నిజలింగప్ప, ప్రవీణ్‌కుమార్, కేవీ.రెడ్డెప్ప, బీఆర్.గౌడ్, పుంగనూరు సమాధి కిరీటి మఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కేబుల్ వైర్ల చోరీ

గంగవరం, జనవరి 1: మండలంలోని కూర్నిపల్లె కొత్తిండ్లు సమీపంలోని పంటపొలాల వద్ద దుండగులు ఆదివారం రాత్రి కేబుల్ వైర్లు చోరీ చేసుకెళ్లారు. బాధిత రైతుల కథనం మేరకు... కూర్నిపల్లె కొత్తిండ్లు గ్రామానికి చెందిన భవానమ్మ, అన్నయ్య, గవన్న, గుణశేఖర్ ఆదివారం రాత్రి పొలం వద్దనుంచి ఇంటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి బోరుమోటర్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా ఆన్‌కాక పోగా, కరెంటు స్తంభం వైపు చూడగా కేబుల్ వైర్లు కనిపించలేదు. స్టార్టర్ వద్ద బోరుకు ఉన్న కనెక్షన్ కత్తిరించి ఉండడం చూసి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఇలా పక్కపక్కనే ఉన్న భవానమ్మ, అన్నయ్య, గవన్న, గుణశేఖర్‌లకు చెందిన బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను కూడా కత్తిరించుకుని దొంగలించుకు పోయినట్లు బాధిత రైతులు వాపోయారు.

మంత్రి పెద్దిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రి పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చింతల రామచంద్రారెడ్డి, అయ్యప్పస్వామి పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్, ఎమ్మెల్యే చెవిరెడ్డి

సదుం, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి సోమవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వెంకటేగౌడ, ఎంఎల్‌సీ భరత్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీశ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం వారిద్దరినీ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి, ఎంపీని కలిసిన వారిలో బోయకొండ ఆలయ ఛైర్మన్ నాగరాజ రెడ్డి, జింకా చలపతి, కొండవీటి నాగభూషణం, సదుం మండల నాయకులు ఉన్నారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం సదుం మండలం ఎర్రాతివారిపల్లె జనసంద్రమైంది. ఏటా ఆంగ్ల సంవత్సర ఆరంభం సందర్భంగా ఎర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. ఆ ఆనవాయితీకి కొనసాగింపుగా సోమవారం కూడా వేలాది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలం దేవళంపేటలోని లక్ష్మీనరసింహస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

రేపు పింఛన్ల పంపిణీ

శాంతిపురం: మండల సచివాలయంలో బుధవారం ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్లతోపాటు ఇదివరకు అందుకుంటున్న వారికీ పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో హేమమాలిని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



పుంగనూరు, శాంతిపురంలలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పుంగనూరు రూరల్, జనవరి1: సీఎం జగన్ ఎన్నికల సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు బైఠాయించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో ఓట్లు కోసం ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ పెద్దలకు ఏమాత్రం చీమకుట్టినట్లు కూడాలేదన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు విజయకుమారి, రమణమ్మ, సునీత, కల్పన, అర్చన, లక్ష్మీదేవి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : రామకుప్పం, శాంతిపురం మండలాల అంగన్వాడీలు మండల సచివాలయం ఆవరణలో టెంటు వేసుకుని సమ్మెకు దిగారు. సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జానపద గేయాలు పాడుతూ కోలాటలు ఆడారు. ప్రజలందరూ నూతన సంవత్సరంలో దేవాలయాలకు వెళ్లి ఆనందంగా గడుపుతుంటే ప్రభుత్వ నిర్లక్ష్యానికి మా బతుకులు ఇలా రోడ్డుపైన పడ్డాయని పాటలు పాడి అందరిని ఆకట్టుకున్నారు.

పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీ వర్కర్లు సాంస్కృతిక పాటలు, డ్యాన్సులతో తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని, ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని వారు డిమాండు చేశారు. యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, ఇషాక్, మంజునాథ్, వెంకటరత్న, రాధ, అనసూయ, లత, ధనమ్మ, గాయత్రి, నీరజ, ఉష, సుమ, లక్ష్మి, హిందు, సరస్వతి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



పలమనేరులో అంగన్‌వాడీ నిరసన

ఘనంగా 'నూతన' సంబరాలు



ననియాల ఎలిఫెంట్ క్యాంపులో సందర్శకులు, ఎకో టూరిజం పార్కులో సందర్శకుల సందడి

రామకుప్పం, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా గ్రామగ్రామాన ఆనందోత్సాహాలతో గడిపారు. రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయం, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను సందర్శించి దేవతామూర్తులకు మొక్కుకున్నారు. మండల పరిధి ననియాలలోని ఎలిఫెంట్ క్యాంపు, ఎకో టూరిజం కేంద్రాలు జనంతో కిటకిటలాడాయి. ఎలిఫెంట్ క్యాంపులోని శిక్షణ పొందిన ఏనుగులు జయంత్, వినాయక్‌లను వారు సందర్శించారు. ఎకో టూరిజం కేంద్రం లోని చిల్డ్రెన్స్ పార్కులో చిన్నారులు ఆహ్లాదంగా గడిపి సందడి చేశారు.

పుంగనూరు రూరల్ : సోమవారం ఉదయం నుంచి పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీఎస్ఐ చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎన్ఎస్‌పేటలోని బంగ్లాలో క్రైస్తవ సోదరులు వనభోజనాలు, క్రీడాపోటీలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరించిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ రాకేష్, కార్యదర్శి రవికుమార్, ప్రతినిధులు సురేశ్, భరత్‌భూషన్, భాస్కర్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కొత్తఇండ్లులో గల బీసీవైపార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్‌ను పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కుప్పం: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మీపురంలో వెలసిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో భక్తులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే కుప్పం పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో కూడా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముత్తుమారెమ్మకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దయెత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.



కుప్పం లక్ష్మీపురంలోని వరదరాజస్వామి, పుంగనూరులో క్రీడల్లో పాల్గొన్న మహిళలు, రామచంద్రయాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

చంద్రబాబు ఫ్లెక్సీకి కురబల పాలాభిషేకం

కుప్పం, జనవరి 1: టీడీపీ అధినేత చంద్రబాబు ఫ్లెక్సీకి కురబ కులస్తులు సోమవారం పాలాభిషేకం చేశారు. కుప్పం పర్యటనలో భాగంగా గత డిసెంబరు 30వ తేదీన చంద్రబాబు కురబ భవన్ వద్ద భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన కురబలపై వరాల జల్లు కురిపించారు. కనదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని, వచ్చే ఎన్నికల్లో కురబలకు తగిన స్థానాలు ఇస్తామని, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని, గొర్రెల కాపరులకు రూ.10 లక్షలు ప్రమాద బీమా కల్పిస్తామని, సబ్సిడీతో గొర్రెల రుణాలు ఇప్పిస్తామని హామీలు ఇచ్చారు. అలాగే కుప్పంలో నిర్మాణంలో ఉన్న కురబ భవన్ నిర్మాణం పూర్తి చేయడానికి రూ.3 కోట్లు ఇస్తామని చెప్పారు. దీంతో కురబ కులస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కనకదాస విగ్రహం ఎదుట చంద్రబాబు ఫ్లెక్సీని ఉంచి పాలాభిషేకం చేసి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురబ నాయకులు నాగభూషణం, రామచంద్ర, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి సేవా సంఘం క్యాలెండరు ఆవిష్కరణ



పుంగనూరు,జనవరి1: పుంగనూరులో వాల్మీకి మహర్షి సేవాసంఘం క్యాలెండర్లను సోమవారం విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు, అద్దాల రమణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులందరూ ఐక్యంగా ఉంటూ ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ముందు కురావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడువాసి దుర్మరణం



మృతి చెందిన వరదరాజులు

వి.కోట, జనవరి 1: వి.కోట-పేర్నాంబట్ ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడువాసి వరదరాజులు మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం ఏరిగుత్తికి చెందిన వరదరాజులు వి.కోటలో తాపీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. నూతన సంవత్సరాన్ని పుర్కరించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహంపై వెళుతుండగా, పాపేపల్లె క్రాస్ సమీపంలోని శనీశ్వరాలయం వద్ద ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వరదరాజులు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

కల్లూరు, జనవరి1: పులిచెర్ల మండలంలో సోమవారం కోడిపందెం ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి రూ.4130 నగదును స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో దేవళంపేట సమీపంలో ఉన్న మామిడితోట వద్దకు చేరుకున్నారు. కోడిపందెం స్థావరాన్ని గుర్తించి దాడి చేశారు. పలువురు పారిపోగా 11 మందిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వీసు రోడ్డు వదిలి ప్రహరీ కట్టండి

వి.కోట, జనవరి 1: నెర్నపల్లె పంచాయతీ మిట్టూరు సమీపంలో చేస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులపై స్థానికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. గతంలో భూసేకరణ సందర్భంగా అధికారులు రైతుల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు విడిచి రోడ్డు పనులు చేపడుతామని తెలిపారని, అయితే అందుకు విరుద్ధంగా రోడ్డు విడవకుండా ప్రహరీ వేస్తుండటంతో తమ పొలాలకు ఎలా వెళ్లాలో తెలియక రైతులు ఆక్షేపణ తెలిపారు. పనులు ఆపాలని గుత్తేదారులకు అభ్యంతరం చెప్పారు. అయితే అందుకు గుత్తేదారులు ప్రభుత్వం తమకు ఇచ్చిన డిజైన్ మేరకు పనులు చేపడుతామని, ఏవైనా అభ్యంతరాలుంటే జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికరులకు తెలపాలని సూచించారు. ఈ విషయమై కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని స్థానిక నేతలు కోరుతున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పుంగనూరు, జనవరి1: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయాన్నే పట్టణంలో పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రెండో విడత ఆరోగ్య సురక్ష

శాంతిపురం, జనవరి1 : అబకలదొడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమమాలిని తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



శాంతిపురం,జనవరి1: మండల పరిధిలోని నడింపల్లెలో వెలిసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులచే పాలాభిషేకం చేపట్టారు. వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు భారీగా తరలవచ్చి స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మొక్కల పంపిణీ

పలమనేరు, జనవరి1 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది కనీసం 15 వేల మొక్కలు నాటించడమే లక్ష్యంగా పెట్టుకొన్నట్లు పలమనేరు ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పేర్కొన్నారు. సోమవారం పలమనేరులో ఆయన మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇళ్లవద్ద ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటించేందుకు ఆయన పట్టణంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 11042 మొక్కలు నాటించామన్నారు.

ఎస్టీయూ క్యాలెండరు ఆవిష్కరణ

పలమనేరు, జనవరి1: పలమనేరులో సోమవారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండరును, డైరీని పలమనేరు ఎస్టీవో మునికృష్ణయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ డైరీలో ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగ పడే ప్రభుత్వ జీవోలు పొందుపరచారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ పలమనేరు మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, భాస్కర్, ఆర్థిక కార్యదర్శి రజాక్, రాష్ట్రకార్యదర్శి రవి, బాలక్రిష్ణ, కుబేర్‌నాయుడు, అస్లాం, ఆరీఫ్ పాల్గొన్నారు.

సోమలను కమ్మేసిన మంచు



సోమల, జనవరి 1: సోమలలో ఉదయం 9గంటలైనా వీడని మంచుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ప్రయాణాలు గగనంగా మారాయి. అటవీ శివారులో ఉన్న పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లెలను మంచు కమ్మేసింది.

చంద్రబాబును కలిసిన ఎస్కే



చౌడేపల్లె, జనవరి1:టీడీపీ అధినేత చంద్రబాబుకు బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ ఎస్కే వెంకటరమణరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు.

15 వరకు రాముడి అక్షితల పంపిణీ

పుంగనూరు రూరల్, జనవరి1: రామమందిరం నుంచి వచ్చిన అక్షితలు, చిత్రపటాలు, కరపత్రాలు ఈనెల 15తేదీ వరకు హిందువుల ప్రతి ఇంటికి పంపిణీ చేస్తున్నట్లు హిందూజాగరణ సమితి సభ్యులు తెలిపారు. సోమవారం రాంపల్లె వీరాంజనేయస్వామి ఆలయం వద్ద, పట్టణంలోని నాగపాళ్యం ప్రాంతంలో అక్షితలు, కరపత్రాలు, చిత్రపటాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బీజేపీ ప్రేమ్‌కుమార్, త్రిమూర్తిరెడ్డి, శివ, బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

రామకుప్పం, జనవరి 1: ఆదివారం రాత్రి ముద్దనపల్లె, నారాయణపురంతాండా నుంచి తమిళనాడుకు తరలుతున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్టు రామకుప్పం అటవీ విభాగాధికారి బాబుప్రసాద్ తెలిపారు. ట్రాక్టర్లు 89పెద్దూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, జయరాంలకు చెందినవిగా గుర్తించామన్నారు. వాటిని ననియాల ఎలిఫెంట్ క్యాంపుకు చేర్చి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. గతంలో కూడా ఇసుక తరలిస్తుండగా చంద్రశేఖర్, జయరాంలకు చెందిన ట్రాక్టర్లను అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని ఒక్కొక్కరికి రూ.11వేలు చొప్పున జరిమానా విధించారు.

చంద్రబాబుకు కంచర్ల శుభాకాంక్షలు



కుప్పం, జనవరి 1: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, చంద్రబాబును సోమవారం ఎమ్మెల్సీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్, కుటుంబంతో సహా హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనకే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు తీసుకున్నారు.

మహిళపై కత్తితో దాడి

గంగవరం, జనవరి 1: మా పొలంలో మేకలు ఎందుకు మేపుతున్నావని ప్రశ్నించిన మహిళా రైతుపై కత్తితో దాడి చేసిన ఘటన గంగవరం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కీలపట్ల బొమ్మనపల్లెకు చెందిన కళావతి గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లగా, అక్కడ పొలంలో మేకలు మేస్తున్న విషయం గుర్తించి పొలంలో ఎందుకు మేకలు మేపుతున్నావని చిన్నూరుకు చెందిన మేకల కాపరి మహేష్‌ను ప్రశ్నించింది. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదనలు చోటుచేసుకుని, ఆగ్రహానికి గురైన మహేష్ తన చేతిలో ఉన్న కొడవలితో దాడికి ప్రయత్నించగా, కళావతి చేయిని అడ్డం పెట్టడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. అరుపులు, కేకలు వేయగా, స్థానికులు అక్కడకు చేరుకొనేలోపు మేకల కాపరి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కళావతిని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు


సినీ హీరో గల్లా అశోక్‌కు ప్రసాదం అందిస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి


శ్రీశైల ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న చైర్మన్

ఐరాల(కాణిపాకం), జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వరసిద్ధుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యేలు ఎమ్మెస్ బాబు, శ్రీనివాసులు, శ్రీశైలం ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుమార్తె రమాదేవి, సినీ హీరో గల్లా అశోక్ ఉన్నారు. వారిని చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ మాజీ చైర్మన్ జగనాథరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా లేబర్ సెస్ వసూలు చేయండి

- కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించండి: ఇన్‌చార్జి కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 1: భవన, ఇతర నిర్మాణ పనులను చేపట్టే యాజమాన్యాల నుంచి సక్రమంగా లేబర్ సెస్ వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డు ఖాతాకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని జేసీ సమావేశ మందిరంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్‌తో కలిసి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణపనులు చేపట్టే యజమానుల నుంచి లేబర్ సెస్ వసూలు చేసి ఆ మొత్తాలను నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఖాతాలకు జమచేసేలా కేంద్ర ప్రభుత్వం కొత్తచట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. నిర్మాణ పనుల అంచనా వ్యయంలో ఒక శాతం సెస్‌ను నిర్ధారించి, ఆ యజమాని నుంచి లేబర్ సెస్‌గా వసూలు చేయాలన్నారు. కార్మికుల నమోదుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ గంగా భవాని, జడ్పీ, ఖజానా, పే అండ్ అకౌంట్స్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు పాల్గొన్నారు.

3న మంగళగిరిలో రాష్ట్రస్థాయి

పంచాయతీరాజ్ సదస్సు


రాజేంద్ర ప్రసాద్‌కు శ్రీవారి ప్రసాదాన్ని అందజేస్తున్న జిల్లా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 1: తమ 16 డిమాండ్ల సాధనకోసం, భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందించే దిశలో భాగంగా ఈనెల 3న గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సు ఏర్పాటు చేసినట్లు పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచ్ సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, కార్యదర్శి కుప్పాల మురళిలు తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు ఈ సదస్సుకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వి. లక్ష్మి ముత్యాలరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యేకి పలువురి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న వైసీపీనేతలు

చిత్తూరు, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఆయన నివాసంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, అధికారులు, నేతలు కలిసి పుష్పగుచ్ఛాలందించి శాలువాలతో సత్కరించారు. అలాగే ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కార్యాలయం వద్ద వైసీపీ నేతలు, అభిమానుల నడుమ ఆయన నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అదేవిధంగా బుల్లెట్‌సురేష్ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేజీకుప్పంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



నగరి, జనవరి 1: నగరి మండల పరిధిలోని ఓజీ కుప్పం పంచాయతీలో గల కేజీ కుప్పంలో ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని నగరి మండల అధ్యక్షులు గాంధీ సోమవారం ఆవిష్కరించారు. భారతదేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు, ఎస్సీ, ఎస్టీ,బీసీ వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు కొనియాడదగినవన్నారు. విద్య, ఉద్యోగాలలో, రాజకీయాలలో బడుగు, బలహీనవర్గాల వారికి రిజర్వేషన్ల సౌకర్యం కల్పించి సమాజంలో అందరి ఎదుగుదల ఉండాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఆయన రచించిన రాజ్యాంగం ఎంతో దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంకే.ప్రకాష్, డి.గోవిందస్వామి, బాలవర్ధిరాజా, మోహన్ మధు, సుబ్రమణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న గురజాల చెన్నకేశవ నాయుడు

చిత్తూరు సిటీ, జనవరి 1: ఓం శక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లిరావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుడిపాల మండలంలోని 190 రామాపురం, కోలావూరు, అడవిచేను గ్రామాల ఓం శక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లారు. వీరికోసం జీజేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 బస్సులను ఉచితంగా ఏర్పాటు చేశారు. నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు జెండాఊపి బస్సులను ప్రారంభించారు. కాగా ఓం శక్తి భక్తులకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుడి మృతి

పాకాల, జనవరి 1: స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట సోమవారం ఓ వృద్ధుడు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు వివరాల మేరకు చిత్తూరు, బజారువీధికి చెందిన జి.వెంకట్రామానాయుడు కుమారుడు జి.రామకృష్ణయ్య (76)గా గుర్తించారు. మృతుడు తెల్లషర్టు, లుంగీ ధరించి వున్నాడు. అనారోగ్యంతో మృతి చెందాడా, ఇతర కారణాలా తెలియాల్సి వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరిగుడిసె దగ్ధం


దగ్ధమైన పూరిగుడిసె ముందు బాధితురాలు

పూతలపట్టు, జనవరి 1: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. మండలంలోని రంగంపేట క్రాస్ రోడ్డు సమీపాన గల కొత్తూరు గ్రామానికి చెందిన శేఖర్, లక్ష్మమ్మ దంపతులు కూలి పనులు చేసుకుంటూ పూరిగుడిసెలో నివాసముంటున్నారు. ప్రతిరోజూలాగా సోమవారం వారు కూలిపనులకు వెళ్లగా, మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెకు నిప్పంటుకుంది. ఈప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధం కావడంతో పాటు, నగదు, బంగారు నగలు మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లింది.

నగరపాలక సంస్థలో నూతన సంవత్సర వేడుకలు


విజయానందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నగర కమిషనర్, మున్సిపల్ సిబ్బంది

చిత్తూరు, జనవరి 1: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కమిషనర్ అరుణ అధికారులతో కలిసి జిల్లా న్యాయమూర్తి భీమారావు దంపతులకు పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీవైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డిలకు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలకకార్యాలయంలో పలువురు ఉద్యోగులు, సంఘాల నేతలు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు పరస్పరం శుభాభినందనలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా, అకౌంట్స్, హెల్త్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పండగపూట కూడా అంగన్వాడీలకు

మనశ్శాంతి లేకుండా చేస్తున్న ప్రభుత్వం


సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న వామపక్ష పార్టీ నాయకులు

చిత్తూరు రూరల్, జనవరి 1: పండగపూట కూడా అంగన్వాడీలకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మనశ్శాంతి లేకుండా చేస్తోందని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 21 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తూ పండగల్లో కూడా మనశ్శాంతి లేకుండా చేస్తోందని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో అంగన్వాడీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. లేకుంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 3వ తేదీన సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నేత నాగరాజు, ఎస్టీయూ రాష్ట్ర నేత గంటా మోహన్, సీఐటీయూ నాయకులు సమ్మె శిబిరానికి వెళ్లి సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం అంగన్వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధనంజయరెడ్డి, గంగరాజు, గోపీనాథ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన

కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం కూడా అంగన్వాడీలు తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. రాష్ట్ర సీఎం తమ సమస్యలను పట్టించుకోలేదని మీరైనా పట్టించుకోండి అంటూ సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం చుట్టూ అంగన్వాడీ కార్యకర్తలు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


చిత్తూరు కోదండరామాలయంలో నాయకనాయ పాశురం పఠిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, జనవరి 1: 2024 నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నగరంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గిరింపేట దుర్గాంబను మాజీ ఎంపీ దివంగత ఆదికేశవులు నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాసులు దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్ వి.కె. విశ్వనాథ్, ఈవో మునిశేఖర్‌లు పాల్గొన్నారు. నగరంలోని అగస్టీశ్వర, రాజుగుడి, సంతపేట కనకదుర్గ, విజయలక్ష్మి కాలనీ రంగనాథ, కట్టమంచి కులందేశ్వర, వరదరాజ ఆలయాలకు భక్తులు తరలివచ్చి మూల విరాట్టులను దర్శించుకుని, పూజలు చేశారు. షిరిడీ విశ్వసాయి బాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు పాల్గొని, స్వామి వారికి పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో ఆలయాల ఈవోలు మునిశేఖర్, సుబ్రమణ్యం నాయుడు, కమలాకర్, అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నాయకనాయ పాశురం పూజలు

స్థానిక కోదండరామాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు వేణుగోపాల్ భక్తి ప్రపత్తులతో ధనుర్మాస నాయకనాయ పాశురం పూజలు నిర్వహించారు. పాల్గొన్న భక్తులతో గోదాదేవి (ఆండాళ్) విరచిత తిరుప్పావైలో మహిమ కలిగిన నాయకనాయ పాశురం పఠింపచేశారు. ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో వున్న బాలగురునాథీశ్వరాలయం, మఠవళంలో ఉన్న గోవత్సనాథీశ్వరస్వామి ఆలయం, బలిజకండ్రిగలోని చెవిటిగంగమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కార్వేటినగరం: టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో వెలసిన శ్రీలక్ష్మీ అమ్మవారికి 5గ్రాముల బంగారు డాలర్‌ను పి.లోకనాథం, జయలక్ష్మి దంపతులు టీటీడీ అధికారుల సమక్షంలో కానుకగా ఇచ్చారు. మండలంలోని ఆలూత్తూరులో టీటీడీ వరదవేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో, జగన్నాథపురంలో శ్రీరామనామ క్షేత్రంలో, మహారాజపురం విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని యజ్ఞం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో రాంప్రసాద్‌శర్మ, వందవాసి మహేశ్‌శర్మ, బాలసుబ్రహ్మణ్యంశర్మ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తవణంపల్లె: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామిని దర్శించుకొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. చైర్మన్ పైమాఘం సురేంద్రారెడ్డి, ఈవో హనుమంతురావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులోని అల్లియెల్లమ్మ, నల్లరాళ్ళపల్లె వద్ద గంగాధరేశ్వర స్వామి, వేపంజేరిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి, అష్టలక్ష్మి తదితర ఆలయాలను మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితో పాటు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు సోమవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేపంజేరి ఆలయట్రస్టీ కె.ఎస్.శ్రీధర్, వాసు, మూర్తి, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

నగరి: నగరి పరిధిలోని బుగ్గగుడి, దేశమ్మగుడి, కరియమాణిక్య స్వామి, ఓంశక్తి, సాయిబాబా, ఈశ్వర దేవాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.


కార్వేటినగరంలో శ్రీలక్ష్మీ అమ్మవారికి బంగారు డాలర్ వితరణ, జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో యజ్ఞం నిర్వహిస్తున్న పురోహితులు, ప్రత్యేక అలంకరణలో కొండ మల్లీశ్వరస్వామి, వేపంజేరిలో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు, నగరిలో దేశమ్మగుడి వద్ద క్యూలో వున్న భక్తులు


జిల్లా టీడీపీ కార్యాలయంలో గురజాల జగన్‌మోహన్‌ను సన్మానిస్తున్న నేతలు, కార్యకర్తలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నానిని సన్మానిస్తున్న మాజీ మేయర్ కటారి హేమలత, పూతలపట్టులో మురళీమోహన్‌ను సన్మానిస్తున్న ఎర్రచెరువుపల్లి గ్రామస్తులు, గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న నగరి టీడీపీ నాయకులు

ఘనంగా నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

చిత్తూరు సిటీ, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను టీడీపీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నానిలను పార్టీ నేతలు కార్యకర్తలు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీ దివంగత డీఏ ఆదికేశవులు కుమారుడు డీఏ శ్రీనివాస్‌ను, డీఏ బద్రి నారాయణను వారి నివాసంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు సమర్పించి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, మాజీ మేయర్ కటారి హేమలత, గురజాల జగన్‌మోహన్, గురజాల చెన్నకేశవులు నాయుడు, మోహన్‌రాజ్ పలువురు నేతలు కలసి శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు సమర్పించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ● స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్‌మోహన్ నివాసంలో పార్టీ నేతలు కార్యకర్తలు కేక్ కట్ చేసి, వేడుకలు జరుపుకున్నారు. జగన్‌మోహన్‌ను ఘనంగా సన్మానించారు.

2024 టీడీపీదే

చిత్తూరు రూరల్: ఈ 2024వ సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి వస్తుందనడంతో సందేహమే లేదని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు రూరల్ మండల టీడీపీ నేత జయచంద్ర నాయుడు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అనంతరం సుమారు 1500 మందికి జయచంద్ర నాయుడు అల్పాహారం ఏర్పాటు చేశారు. చిత్తూరు రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు వీరిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి, తవణంపల్లి మాజీ జడ్పీటీసీ వెంకటేష్, టీడీపీ నాయకులు శశికర్ బాబు, రఘు, మంజూష్, మేషాక్, శ్రీకాంత్, దేవరాజులు నాయుడు, నీలకంఠం నాయుడు, జగదీష్ నాయుడు, కుమార్, కాశీ, శోభన్‌బాబు, గురేష్, చల్లా, శ్యామ్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకే సీఎం కిరీటం

పూతలపట్టు: టీడీపీ అధినేత చంద్రబాబుకు ముఖ్యమంత్రి అయ్యే బంగారు కిరీటాన్ని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని పూతలపట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ అన్నారు. పూతలపట్టులో సోమవారం టీడీపీ ఎస్ఆర్ఐలు ఊట్ల శ్యామసుందర్‌రావు, దగ్గుబాటి బాలకృష్ణ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సంబరాలను నియోజకవర్గ టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ఫొటోలతో ఏర్పాటు చేసిన భారీకేక్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, వెంకటేశ్వర చౌదరి, చంద్రమౌళి, దగ్గుబాటి లక్ష్మీనారాయణ, ప్రమోద్, చిరంజీవి, దగ్గుపాటి మోహన్, ఊట్ల నాగరాజ నాయుడు, హేమాద్రి, మోహన్, దాము, మంజు, మునిరాజు, నాగయ్య, సుబ్బరాజులు, శరవణ కుమార్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నగరి: నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ను తిరుపతిలోని ఆయన నివాసంలో నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నగరి టీడీపీ నాయకులు బాలాజీ, ధనంజయరాజు, నారాయణస్వామి నాయుడు, గుణశేఖర్, చిట్టి, సాయి, ఐటీడీపీ ధనంజయలు నాయుడు, సుబ్రమణ్యంరాజు, యువత కేక్ కట్ చేయించారు. విజయపురం, నిండ్ర, నగరి, పుత్తూరు, వడమాలపేట మండలాల నుంచి తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు.

అమర్‌నాథరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు

పెనుమూరు: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పలమనేరులోని మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి నివాసంలో పలువురు టీడీపీనేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు, నాగేశ్వరరాజు, ఈశ్వర నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, ఆరు మండలాల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, జయశంకర్ నాయుడు, లోకనాథరెడ్డి, రాజేంద్రన్, చెంగ్రాలాయ యాదవ్, స్వామిదాస్, నేతలు శ్రీధర్‌యాదవ్, జనార్ధన్ రాజు, తలారిరెడ్డెప్ప, పరమేశ్వరరెడ్డి, భాస్కర్, యువరాజులునాయుడు, ఎన్.ఎస్.నాయుడు, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబే సీఎం

పాలసముద్రం: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమితో రాష్ట్రంలో అఖండ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుల గుర్తింపు కమిటీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు తెలిపారు. సోమవారం రేవా రిసార్ట్‌లో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి, కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడు కుటుంబసభ్యుల పేర్లమీద పూజలు చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్ రాజు, రవి నాయుడు, ప్రతాప్ నాయుడు, అరుళ్‌నాథన్, సాంబశివన్, లోకనాథ నాయుడు, జానకిరామ నాయుడు, వెంకటేశులు నాయుడు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మాజీ మంత్రి అమరనాథరెడ్డిని సోమవారం ఎస్ఆర్‌పురం మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఆయన సోదరుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, గజమాలతో, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలంధర్ నాయుడు, నీరం జన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, హైదార్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డిని సన్మానిస్తున్న పెనుమూరు టీడీపీ నేత లోకనాథ నాయుడు తదితరులు, గంధమనేని సోదరులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేస్తున్న భీమనేని చిట్టిబాబు

చంద్రబాబుకు కంచర్ల శుభాకాంక్షలు

కుప్పం, జనవరి 1: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు, చంద్రబాబు ను సోమవారం ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీకాంత్, కుటుంబంతో సహా హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనకే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు తీసుకున్నారు.

మహిళపై కత్తితో దాడి

గంగవరం, జనవరి 1: మా పొలంలో మేకలు ఎందుకు మేపుతున్నావని ప్రశ్నించిన మహిళా రైతుపై కత్తితో దాడి చేసిన ఘటన గంగవరం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కీలపట్ల బొమ్మనపల్లెకు చెందిన కళావతి గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లగా, అక్కడ పొలంలో మేకలు మేస్తున్న విషయం గుర్తించి పొలంలో ఎందుకు మేకలు మేపుతున్నావని చిన్నూరుకు చెందిన మేకల కాపరి మహేష్‌ను ప్రశ్నించింది. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదనలు చోటుచేసుకుని, ఆగ్రహానికి గురైన మహేష్ తన చేతిలో ఉన్న కొడవలితో దాడికి ప్రయత్నించగా, కళావతి చేయిని అడ్డం పెట్టడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. అరుపులు, కేకలు వేయగా, స్థానికులు అక్కడకు చేరుకొనేలోపు మేకల కాపరి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కళావతిని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

అన్యాక్రాంతంలో తక్కనకుంట

- చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు


అన్యాక్రాంతమైన తక్కనకుంట

బంగారుపాళ్యం, జనవరి 1: బంగారుపాళ్యం మండలానికి అతిసమీపంలోని తగ్గువారిపల్లె పంచాయతీ తక్కనకుంట అన్యాక్రాంతానికి గురవుతోంది. మొగిలివెంకటగిరి రెవిన్యూ తగ్గువారిపల్లె గ్రామంలో రెవిన్యూ లెక్కల ప్రకారం సర్వే నెం. 206/6లో 3.02 ఎకరాల విస్తీర్ణంలో ఈ తక్కనకుంట ఉంది. ఇది రోజురోజుకూ అన్యాక్రాంతానికి గురవుతూ ప్రస్తుతం ఒక ఎకరా విస్తీర్ణం కూడా లేదు. తక్కనకుంట గట్టుపై పలు నిర్మాణాలను కూడా నిర్మించుకుని వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్నారు. మరోవైపు నివాస గృహస్తులు కుంటను చదునుచేసి ఆక్రమించుకుంటున్నారు. భవనాలు కూల్చిన మట్టిరాళ్ళతో మరోవైపు నుంచి కుంటను పూడ్చుకుంటూ వస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిరోజు ఈ మార్గంలోనే మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తూ వస్తున్నా తమకేమి తెలియనట్లు ఉంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కుంట దురాక్రమణను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



పలమనేరులో అమరనాథరెడ్డిని గజమాలతో సన్మానం చేస్తున్న జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ తదితరులు


పాలసముద్రంలో టీడీపీ ప్రభావ శీలుల గుర్తింపు కమిటీ రాష్ట్ర సభ్యులు చిట్టిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెదురుకుప్పం పార్టీ ప్రముఖులు